కబరస్తాన్ స్థలం చుట్టూ ఉప ఎన్నిక

నేతల హామీ.. ప్రజల ఎదురుచూపు

బోరబండ, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): సాధారణంగా ఎన్నికలంటే ఒక అంశం ప్రచార అస్త్రంగా ఉంటుంది. అభ్యర్థుల జయాపజయాలను నిర్దేశించడంలో ఆ అంశం కీలకంగా మారుతుంది. రెండు తెలుగు రాష్ట్రాల్లో హాట్ టాపిక్‌గా మారిన జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కీలకమైన అంశం ఏమిటో తెలుసా...? కబరస్తాన్, బొందలగడ్డ, గ్రేవ్ యార్డ్. ఎన్నికల ప్రచారంలో కబరస్తాన్ స్థలం అంశాన్ని డిసెంబరు 31లోగా పరిష్కరిస్తానని సాక్షాత్తు సీఎం రేవంత్‌రెడ్డి పలుమార్లు ప్రముఖంగా ప్రస్తావించడం దాని ప్రాముఖ్యతను తెలియజేస్తోంది.

జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో 4లక్షల మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో ముస్లిం ఓటర్లు సుమారు ఒక లక్షా 25వేల మంది. అభ్యర్థుల గెలుపోటములను ప్రభావితం చేయడంలో ముస్లింలు కీలకం. దీంతో ప్రధాన పార్టీలు వీరి సమస్యలపై దృష్టి కేంద్రీకరించాయి. నియోజకవర్గంలోని కొన్ని డివిజన్లలో కబరస్తాన్ స్థలాలు లేవని, ఉన్నచోట్ల పూర్తిగా నిండిపోయాయని కొన్ని నెలలుగా ముస్లింలు ఆందోళన చేస్తున్నారు. కబరస్తాన్ కోసం స్థలాన్ని కేటాయించాల్సిందేనంటూ ప్రజాప్రతినిధులు, నాయకులు ప్రభుత్వానికి పలుసార్లు విన్నవించారు. ఎన్నికల నోటిఫికేషన్ విడుదలకు ముందే బొందలగడ్డ స్థలం విషయాన్ని తేల్చాలని పట్టుబట్టారు. లేకుంటే ఎన్నికలో ఓటు వేసేది లేదని తేల్చి చెప్పారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం ఆగమేఘాల మీద కబరస్తాన్ కోసం షేక్‌పేట్ ప్రాంతంలో 2,500 గజాల స్థలాన్ని కేటాయిస్తున్నట్లు ఎన్నికల కోడ్ రాకముందే ప్రకటించి సంబంధిత పత్రాలను కమిటీ ప్రతినిధులకు అందజేశారు. రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, గడ్డం వివేక్ వెంకటస్వామి, అడ్లూరి లక్ష్మణ్, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహ్మద్ అజారుద్దీన్, వక్ఫ్ బోర్డు చైర్మన్ తదితరుల సమక్షంలో అట్టహాసంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. అయితే, ఆ స్థలం సైన్యానికి సంబంధించినదన్న వివాదం మొదలైంది.

ఇదిలా ఉండగా, ఎర్రగడ్డ ప్రాంతంలో కల్పతరువు, బ్రిగేడ్ సిటాడెల్ గేటెడ్ కమ్యూనిటీలు, ప్రైమ్ గార్డెన్ ఫంక్షన్ హాల్ వెనక ఉన్న స్థలం కబరస్తాన్ కోసం కేటాయిస్తున్నట్లు అధికారులు ఇటీవల ప్రకటించారు. గతంలోనే ఈ స్థలం వక్ఫ్ గెజిట్‌లో ఉందని తెలిపారు. దీంతో ఈ రెండు గేటెడ్ కమ్యూనిటీల్లో కలకలం మొదలైంది. రూ. కోట్లు పెట్టి కొనుగోలు చేసిన ఫ్లాట్ల వద్ద కబరస్తాన్ కోసం స్థలాన్ని కేటాయించడం పట్ల కొందరు నిరసన వ్యక్తం చేశారు. దీనిని ఎన్నికల ప్రచార అస్త్రంగా బీజేపీ మలుచుకుంది. ఆ పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు ఈ గేటెడ్ కమ్యూనిటీలో ప్రత్యేక సమావేశాలు నిర్వహించి బొందలగడ్డకు వ్యతిరేకంగా ప్రచారం చేశారు. బొందలగడ్డ అంశంతో తమకు ఓట్లు బాగా పడతాయని ఆ పార్టీ ఆశిస్తోంది. కాగా, ప్రైమ్ గార్డెన్ ఫంక్షన్ హాల్ పక్క నుంచి కబరస్తాన్‌కు వెళ్లేందుకు మార్గం విడిచి పెడుతున్నట్లు యాజమాన్యం ప్రకటించినట్లు సమాచారం.

ఇక బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఏకంగా కబరస్తాన్ కోసం స్థలాన్ని కొనుగోలు చేసి ముస్లింలకు అప్పగిస్తామని ఎన్నికల ప్రచారంలో ప్రకటించారు. ఎంత ఖరీదైన స్థలమైనా సరే కబరస్తాన్‌కు అందించేందుకు వెనకాడబోమని ఆయన పదేపదే చెబుతూ వచ్చారు.

సీఎం రేవంత్‌రెడ్డి ప్రచారంలో కబరస్తాన్ కోసం స్థలాన్ని కేటాయిస్తామని హామీ ఇచ్చారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ కూడా ప్రచారంలో కబరస్తాన్ స్థలం అంశాన్ని ప్రస్తావించారు. మొత్తంగా కబరస్తాన్ అంశం ప్రధాన పార్టీలకు ప్రచారంగా మారిందని చెప్పవచ్చు.



కబరస్తాన్ కోసం ఆందోళన చేస్తున్న ముస్లిం సంఘాలు(ఫైల్)

బొందలగడ్డ విస్తరణ

కబరస్తాన్ స్థలం ఉపఎన్నికలో కీలక అంశంగా మారిన తరుణంలో ఓ కాంగ్రెస్ నాయకుడు బొందలగడ్డ స్థలాన్ని విస్తరించే కార్యక్రమం చేపట్టారు. సొంతూరు నుంచి పనివాళ్లను రప్పించిన ఆయన తన డబ్బులు ఖర్చు పెట్టి ముస్లింలు అధికంగా ఉండే ఒక డివిజన్ పరిధిలోని కబరస్తాన్‌లో ఉన్న కొండను పగలగొట్టించారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థికి ఎక్కువ ఓట్లు లభించేలా చూడాలని తనకు అప్పగించిన బాధ్యతను ఆ నాయకుడు ఈ రకంగా నెరవేర్చారు.


రైల్వే జీఎంకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న పెన్షనర్స్ అసోసియేషన్ సభ్యులు

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి

చిలకలగూడ, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని, రైల్వే ఆస్పత్రిలో మెరుగైన సౌకర్యాలు కల్పించాలని పెన్షనర్స్ అసోసియేషన్ సభ్యులు రైల్వే జీఎం సంజయ్‌కుమార్ శ్రీవాస్తవను కోరారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎస్ఎన్‌సీ రామకృష్ణాచార్యులు, ఏజీకే మూర్తి, కెనారాయణ, విద్యాసాగర్, సాయికుమార్ రైల్వే జీఎంకు గురువారం వినతిపత్రం అందజేశారు. డిసెంబరులో నిర్వహించనున్న అసోసియేషన్ త్రైవార్షిక సమావేశం, పెన్షనర్స్ డే వేడుకల్లో పాల్గొనాలని కోరారు.

ముచ్చింతల్‌కు బస్సులు

తిరుమలగిరి నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): రిసాలాబజార్ నుంచి ముచ్చింతల్‌కు ప్రతీ శుక్ర, శని, ఆదివారాల్లో ప్రయాణికుల సౌకర్యార్థం బస్సులను ఏర్పాటు చేసినట్లు హకీంపేట డిపో మేనేజర్ సరిత తెలిపారు. రిసాలాబజార్ నుంచి ఉదయం 7.20 గంటలకు, అల్వాల్ నుంచి మధ్యాహ్నం 3 గంటలకు బస్సులు బయలుదేరతాయని తెలిపారు. అలాగే, ముచ్చింతల్ నుంచి మధ్యాహ్నం 12:30 గంటలకు, రాత్రి 8 గంటలకు బస్సులు బయలుదేరతాయని ఆమె తెలిపారు. ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

16న ప్రొఫెసర్ సుఖాడియో తోరత్ జయంతి

హైదరాబాద్ సిటీ, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ ఎకానమిస్ట్, విద్యావేత్త, ప్రొఫెసర్ సుఖేదియో తోరత్ 75వ జయంతిని పురస్కరించుకొని సెంటర ఫర్ దళిత్ స్టడీస్, లతారాజా ఫౌండేషన్, ఎస్సీ, ఎస్టీ ఆఫీసర్స్ ఫోరం సంయుక్త ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని సెంటర్ ఫర్ దళిత్ స్టడీస్ నిర్వాహకులు పేర్కొన్నారు. ఈనెల 16న బోరబండలోని సెంటర్ ఫర్ దళిత్ స్టడీస్ కార్యాలయంలో మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహించే కార్యక్రమంలో ఏ లైఫ్ ఐడియాస్ పేరుతో ఆయన రాసిన పుస్తకాలపై విశ్లేషణ ఉంటుందని వారు తెలిపారు. ఈ కార్యక్రమానికి జస్టిస్ సుదర్శన్‌రెడ్డి, హరియాణా అడిషనల్ చీఫ్ సెక్రటరీ డాక్టర్ రాజశేఖర్ ఉండ్రు హాజరవుతారని తెలిపారు.

నిరుద్యోగులకు శిక్షణ, ఉపాధి అవకాశాలు

అడ్డగుట్ట, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : నిరుద్యోగ యువతీ యువకులకు మెడికల్ కోడింగ్ బిల్లింగ్ శిక్షణ, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్లు ఆప్సోటెక్, టెక్ మహీంద్రా ఫౌండేషన్ స్మార్ట్ ట్రైనింగ్ సెంటర్ హబ్సిగూడ సెంటర్ సమన్వయకర్త పురుషోత్తంగోపీ తెలిపారు. 20-27 ఏళ్ల మధ్య వయస్సు కలిగి, బీఎస్సీ, ఎమ్మెస్సీ, బీఫార్మా, ఎంఫార్మా, బీకాం, ఎంకాం విభాగాల్లో ఉత్తీర్ణులైన వారికి మెడికల్ కోడింగ్, బిల్లింగ్ టెర్మినాలజీ, ఎమ్మెస్ ఆఫీస్, స్పోకెన్ ఇంగ్లిష్, ఇంటర్నెట్, ఇంగ్లిష్ టైపింగ్, కమ్యూనికేషన్ స్కిల్స్, ఇంటర్వ్యూల్లో శిక్షణతో పాటు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్లు ఆయన తెలిపారు. వివరాలకు 9154990132, 9154990131లో సంప్రదించాలని ఆయన సూచించారు.


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న రాములు, చిదంబరం, రఘుశ్రీ

'ప్రాణధార' ఆవిష్కరణ

చిక్కడపల్లి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): స్ఫూర్తిని నింపే ఆశావహ రచనలే రచయితకు ప్రాణధారగా నిలుస్తాయని హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం తెలుగుశాఖ అధ్యక్షుడు డాక్టర్ పిల్లలమర్రి రాములు అన్నారు. మానస ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో గురువారం రాత్రి త్యాగరాయగానసభలో ప్రముఖ కవి, రచయిత అంబల్ల జనార్దన్ రచించిన ప్రాణధార కథానిక సంపుటి ఆవిష్కరణ కార్యక్రమం ప్రముఖ రచయిత కూర చిదంబరం అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథిగా కార్యక్రమంలో పాల్గొని పుస్తకాన్ని ఆవిష్కరించిన పిల్లలమర్రి రాములు మాట్లాడుతూ అనేకమందికి తెలంగాణలోని వలస జీవనం అనేక అనుభవాలను నేర్పిందన్నారు. అంబల్ల జనార్దన్ బొంబాయిలో పుట్టినా తన పూర్వీకుల జీవితాలను చూసి కుంగిపోలేదన్నారు. పలువురు ఆత్మవిశ్వాసంతో కష్టాలను జయించి వృత్తుల్లో రాణించిన సందర్భం మరిచిపోలేనిదన్నారు. అలాంటి వారిలో అంబల్ల జనార్దన్ ఒకరని, ఆయన సాహితీ యోధుడిగా మారి రచనలు చేయడం విశేషమని పేర్కొన్నారు. కూర చిదంబరం మాట్లాడుతూ 75సంవత్సరాల వయసులోనూ చురుకుగా, నిబద్ధతతో స్ఫూర్తివంతమైన రచనలను అందించిన గొప్ప దార్శనికుడు జనార్దన్ అని అభినందించారు. అనేక భాషల్లో ఆయన రచనలు అనువదింపబడడం, మహారాష్ట్ర పాఠ్యపుస్తకాల్లో ఆయన రచనలు చోటుచేసుకోవడం తెలంగాణకు గర్వకారణమన్నారు. గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి, ప్రముఖ ఆశుకవి డా.రాధశ్రీ, బండారుపల్లి రామచందర్ రావు, డా.లలితవాణి, రఘుశ్రీ తదితరులు పాల్గొన్నారు.


కల్యాణానికి హాజరైన భక్తులు

ఘనంగా ఆంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం

బంజారాహిల్స్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): బంజారాహిల్స్ రోడ్డు నెం.14 నందినగర్‌లోని శ్రీ ఆంజనేయస్వామి ఆలయ చతుర్థ వార్షికోత్సవ వేడుకలు వైభవంగా జరుగుతున్నాయి. గురువారం ఆలయంలో శ్రీ లక్ష్మీనరసింహస్వామి, సీతారాముల కల్యాణ వేడుకలను వైభవంగా నిర్వహించారు. అంతకుముందు సీతాలక్ష్మణ, హనుమత్ సమేత శ్రీ రామచంద్రస్వామి ఉత్సవమూర్తులకు 108 కలశాలతో అభిషేకం నిర్వహించారు. సాయంత్రం సుందరకాండ పారాయణం అనంతరం నిర్వహించిన పుష్పయాగం వేడుకలు వైభవంగా జరిగాయి. కార్యక్రమంలో ఆలయ అర్చకులు శైష శైలాచార్యులు, చైర్మన్ దశరథ చౌహాన్ తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

బేగంపేట, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): పేదల సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని ఆ పార్టీ కూకట్‌పల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రమేష్ అన్నారు. గురువారం బేగంపేట డివిజన్‌లోని మయూరి మార్గ్‌లో ఆయన పర్యటించారు. కాంగ్రెస్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. స్థానికులను అడిగి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం నెరవేరుస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు హసిటోచర్, జైపాల్, జాన్, విశాల్ సుధాం పాల్గొన్నారు.


కాంగ్రెస్ పార్టీ జెండావిష్కరణలో బండి రమేష్

గంజాయి, ఎండీఎంఏ స్వాధీనం

- ముగ్గురు అరెస్ట్


నిందితులతోపాటు గంజాయి, డ్రగ్స్‌ను చూపిస్తున్న ఎక్సైజ్ సిబ్బంది

హైదరాబాద్ సిటీ, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): బంజారాహిల్స్‌లోని కేబీఆర్ పార్కు వద్ద గంజాయి, ఎండీఎంఏ విక్రయిస్తున్న ముగ్గురు యువకులను ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పట్టుకున్నారు. వారి నుంచి 2.50 కిలోల గంజాయి, 2 గ్రాముల ఎండీఎంఏ స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పి.వేమేష్, కె.దేవీచరణ్, వై.హేమంత్ ద్విచక్ర వాహనాలపై కేబీఆర్ పార్కు పరిసరాల్లో తిరుగుతూ కస్టమర్లకు గంజాయి, ఎండీఎంఏ విక్రయిస్తున్నారు. పక్కా సమచారం మేరకు ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ టీమ్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్‌గౌడ్ బృందం నిఘా పెట్టింది. గంజాయి విక్రయించేందుకు రెండు వాహనాలపై వచ్చిన వేమేష్, దేవీచరణ్, హేమంత్‌ను అరెస్ట్ చేశారు. వారి నుంచి 2.50 కిలోల గంజాయి, 2 గ్రాముల ఎండీఎంఏ, రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు.

నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్ స్వాధీనం

గోవా, ఢిల్లీ, హరియాణా నుంచి నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్ సరఫరా అవుతుందనే సమాచారం మేరకు ఎక్సైజ్ ఎస్‌టీఎఫ్ సిబ్బంది పహాడిషరీఫ్ ప్రాంతంలో వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ తనిఖీల్లో పలు వాహనాల్లో పరిమితికి మించి తరలిస్తున్న 48 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామని ఎక్సైజ్ ఎస్‌టీఎఫ్ టీమ్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు.

కొనసాగుతున్న ఓయూ అధ్యాపకుల నిరసన


నిరసన తెలియజేస్తున్న అధ్యాపకులు

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఉస్మానియా యూనివర్సిటీ అధ్యాపకుల పదోన్నతుల్లో తీవ్రమైన అన్యాయం జరిగిందని, ఈ విషయంపై వర్సిటీ అధికారులు మౌనం వహించడం బాధాకరమని ఓయూ టీచర్స్ అసోసియేషన్(ఔటా) అధ్యక్షుడు ప్రొ.మనోహర్ ఆవేదన వ్యక్తం చేశారు. ఓయూ అధ్యాపకులు నెలన్నరగా నిరసన వ్యక్తం చేస్తున్నా ప్రభుత్వ పెద్దలకు చీమ కుట్టినట్లు కూడ లేదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ అన్యాయాన్ని నిరసిస్తూ ఔటా ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఆందోళనలు గురువారం 43వ రోజుకు చేరుకున్నాయి. కామర్స్ కళాశాల ఎదుట అధ్యాపకులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ప్రొఫెసర్లు వెంకటదాస్, రమేశ్, రామకృష్ణ, వెంకటేశ్వరరావు, నతానియల్, శశికళ, సుజాత, మాధురి, అరవింద్, శ్రీనివాస్‌నాయక్, గంగాధర్, శ్రీనివాస్‌రెడ్డి, అపర్ణ, రమేశ్‌బాబు, కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.

కొత్త రేషన్‌కార్డు దారులు ఈ-కేవైసీ చేయించుకోవాలి

ఖైరతాబాద్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): కొత్తగా రేషన్‌కార్డులు పొందినవారు తప్పకుండా ఈ-కేవైసీ చేయించుకోవాలని సర్కిల్-7 అసిస్టెంట్ సివిల్ సప్లై అధికారి జ్యోతి తెలిపారు. ఈ మేరకు ఆమె గురువారం ఒక ప్రకటనను విడుదల చేశారు. ఖైరతాబాద్ సర్కిల్‌లో ఇప్పటి వరకు 33 శాతం మంది మాత్రమే ఈ-కేవైసీ చేసుకున్నారని, మిగతా వారు త్వరగా చేసుకోవాలని ఆమె సూచించారు.


చెరువులో నింపిన మట్టి

చెరువులో మట్టి నింపిన వారిపై చర్యలు తీసుకోవాలి

తిరుమలగిరి నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): తిరుమలగిరి లేక్ చెరువులో బుధవారం రాత్రి టిప్పర్ల సాయంతో గుర్తుతెలియని వ్యక్తులు భారీగా మట్టి పోశారు. చెరువును కబ్జా చేసేందుకు యత్నిస్తున్నారని కాలనీవాసులు మధుసూదన్, సతీష్, రాకేష్ తదితరులు ఆందోళన వ్యక్తం చేశారు. చెరువు విస్తీర్ణం తగ్గించేందుకు అక్రమంగా మట్టిని నింపుతున్నారని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ అక్రమ కార్యకలాపాలపై వెంటనే చర్యలు తీసుకోవాలని అధికారులను డిమాండ్ చేశారు.



బోరబండ స్టేషన్‌లో ఎంఎంటీఎస్ రైళ్ల సమాచారం

అల్లాపూర్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): బోరబండ ఎంఎంటీఎస్ స్టేషన్ నుంచి లింగంపల్లి, హైదరాబాద్, ఫలక్‌నుమా(వయా సికింద్రాబాద్) వైపునకు సమయ సూచికలు, రైల్వే స్టేషన్‌లో అధికారులు ఇచ్చిన సమాచారం. ++ గుర్తు కల్గిన ట్రైన్ సోమవారం నుంచి శుక్రవారం వరకు అని అర్థం. && గుర్తు కలిగినవి కొత్తగా, అంటే 20-04-2025 నుంచి పునరుద్ధరించినవి. %% గుర్తు కలిగిన రైలు ఘట్‌కేసర్ నుంచి ప్రారంభమై లింగంపల్లి వయా బోరబండ వెళ్తుంది. cc గుర్తు కలిగిన రైలు మేడ్చల్ నుంచి ప్రారంభమై లింగంపల్లి వయా బోరబండ వెళ్తుంది. అనివార్య కారణాలతో ట్రైన్ రద్దు కావడం, సమయ సూచికలో మార్పుల కోసం స్టేషన్ అధికారులను సంప్రదించగలరు.

లింగంపల్లి:
ఉదయం 05:57,06:12, 06:30++, 07:09&&, 07:22, 08:17, 08:32, 08:49%% 09:02, 09:22cc, 09:42, 09:42, 10:17, 10:17, 10:27++, 11:12, మధ్యాహ్నం 12:01&&
సాయంత్రం 16:57, 17:42++, 17:43, 17:57, 18:27, 18:51&&, 19:22, 19:15++, రాత్రి 20:11, 20:22, 20:42++, 21:02, 21:07, 21:41&&, 21:42++, 22:12, 22:37, 23:06&&, 23:17++, అర్ధరాత్రి 00:17

ఫలక్‌నుమా:
ఉదయం 04:16, 06:16, 07:01, 07:41++, 8:46, 09:15, 09:51, 10:41, 11:36&&
సాయంత్రం 16:31++, 16:56&&, 17:29, 17:46&&, 17:56++, 18:16, 18:56++, 19:36, రాత్రి 20:11&&, 20:16++, 21:41, 21:51, 22:29, 22:36(సికింద్రాబాద్ వరకు)&&, 23:05++, 23:40

హైదరాబాద్‌కు:
ఉదయం 07:20, 08:15, 10:05
సాయంత్రం 16:20++&&, 17:30, 19:10, రాత్రి 20:13, 29:25

మేడ్చల్‌కు: ఉదయం 10:26, సాయంత్రం 18:46

ఘట్‌కేసర్‌కు:సాయంత్రం 17:36


విశ్రాంతి శాల


చెట్ల కింద భోజనాలు

నిమ్స్‌లో నీడ కరువు

నిమ్స్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): నిమ్స్‌లో రోగుల సహాయకులకు వసతి లేక ఇబ్బంది పడుతున్నారు. ఖాళీ స్థలంలో నిలబడ్డా, కూర్చున్నా సెక్యూరిటీ గార్డులు దురుసుగా ప్రవర్తిస్తున్నారు. చెట్ల కింద భోజనాలు చేస్తున్నా ఇబ్బంది పెడతున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. నిమ్స్ ఆస్పత్రిలో రెండు విశ్రాంతి శాలలు మాత్రమే ఉన్నాయి. చికిత్స కోసం రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చే వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. ప్రస్తుతం ఓపీకి వసున్న వారి సంఖ్య మూడు వేలు దాటుతోంది. కాగా, ఇన్‌పేషెంట్లు వెంట సహాయకులను తెచ్చుకుంటారు. వీరిని లోపల ఉండేందుకు ఆస్పత్రి సిబ్బంది అనుమతించరు. దీంతో వారు ఆస్పత్రి ఆవరణలోనే చెట్లకింద, కారిడార్‌లో సేద తీరుతారు. చెట్లకింద కూర్చుని భోజనాలు చేస్తున్నారు. ఇక్కడ ఎవరూ ఉండడానికి వీలులేదంటూ సెక్యూరిటీ గార్డులు వెళ్లగొడుతున్నారు. అంతటితో ఆగకుండా వారి పట్ల దురుసుగా ప్రవర్తిస్తున్నారు.

మానవత్వం లేకుండా..

సెక్యూరిటీ విధులు నిర్వహిస్తున్న గార్డులంతా ఇతర రాష్ట్రాలకు చెందిన వారు. వీరికి హిందీ తప్ప మరో భాష రాదు. కనీస మావత్వం లేకుండా హిందీలో తిడుతూ రోగుల సహాయకుల పట్ల దురుసుగా ప్రవర్తిస్తూ వెళ్లగొట్టడం ఎంతవరకు సబబని కొందరు ప్రశ్నిస్తున్నారు.


చెట్లకింద సేదతీరుతున్న రోగుల సహాయకులు

భద్రత అంతంత మాత్రమే

- ఆందోళనలో కార్గో వినియోగదారులు
- జేబీఎస్‌లో పార్సిల్స్ స్కాన్ చేసే యంత్రాలు నిల్



కార్గో అండ్ పార్సిల్స్ కౌంటర్ల వద్ద అట్ట బాక్సులు, ఇతర మెటీరియల్స్

మారేడుపల్లి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో కారు బాంబు దాడుల జరిగిన సంగతి విదితమే. ఈ నేపథ్యంలో నగరంలో పోలీసులు భద్రతను కట్టుదిట్టం చేశారు. కానీ తెలంగాణతో పాటు, ఇతర రాష్ట్రాలకు వెళ్లే ప్రయాణికులతో రద్దీగా ఉండే పికెట్ జూబ్లీ బస్‌స్టేషన్, కార్గో అండ్ పార్సిల్ సెంటర్ల పరిసర ప్రాంతాల్లో భద్రత అంతంతమాత్రంగా ఉంది. దీంతో ప్రయాణికులు, కార్గో వినియోగదారులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఏ పార్సిల్‌లో ఏ ప్రమాదకర పదార్థాలు ఉన్నాయోనని ప్రయాణికులు అనుమానాస్పదంగా చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. బస్‌స్టేషన్, కార్గో అండ్ పార్సిల్ సెంటర్ల పరిసర ప్రాంతాల్లో భద్రతను పెంచాలని పార్సిల్ వినియోగదారులు కోరుతున్నారు. పికెట్ జేబీఎస్‌లో కార్గో అండ్ పార్సిల్ సెంటర్ నుంచి తెలంగాణతో పాటు, ఇతర రాష్ట్రాలకు కూడా ఇక్కడి నుంచే ఫార్మా, ఆహార పదార్థాలు, బియ్యం, మోటార్లు, ఎలక్ట్రిక్ ఇతరాత్ర వస్తువులను పార్సిల్ బాక్సుల్లో చేరవేస్తుంటారు. అలా పార్సిల్స్ చేసిన మెటీరియల్స్‌ను తీసుకునేప్పుడు, బయటకు పంపేప్పుడు స్కానర్ ద్వారా చెక్ చేయాలి. కానీ ఇక్కడ మెటీరియల్స్‌ను స్కానింగ్ చేసే మిషన్ లేకపోవడం గమనార్హం. ఇక్కడ పార్సిల్స్ పంపించే వారి పేరు ఫోన్ నంబర్, అలాగే పార్సిల్స్ తీసుకునే వారి అడ్రస్ ఫోన్ నంబర్‌ను కంప్యూటర్‌లో భద్రపరిచి బార్ కోడ్ కేటాయించి అతికిస్తారు అంతే. ఢిల్లీ పేలుళ్ల నేపథ్యంలోనైనా పార్సిల్‌కార్యాలయం వద్ద భద్రతపరంగా తగిన చర్యలు తీసుకుంటే బాగుంటుందని ప్రయాణికులు, పార్సిల్స్ పంపే వినియోగదారులు కోరుతున్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం

పార్సిల్ తీసుకువచ్చే వినియోగదారుని అడ్రస్‌తో పాటు, ఫోన్ నంబర్, ఎక్కడికి పంపిస్తున్నారో అక్కడి వారి అడ్రస్ ఫోన్ నంబర్ సమాచారాన్ని కంప్యూటర్‌లో పొందుపరుస్తున్నాం. కార్గో అండ్ పార్సిల్ కౌంటర్ల వద్ద ఇప్పటికే 8 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశాం. అయితే మెటీరియల్‌ను స్కానర్ చేసే యాంత్రాన్ని కూడా ఏర్పాటు చేసేవిధంగా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తాం. **- ఇసాక్ బిన్ మహమ్మద్, గ్రేటర్ జోన్ అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ (లాజిస్టిక్స్)**



జేబీఎస్‌లో కార్గో అండ్ పార్సిల్ కౌంటర్ల వద్ద వినియోగదారులు





శిబిరంలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

ఉచిత వైద్యశిబిరం

బౌద్ధనగర్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): బౌద్ధనగర్ జీహెచ్‌ఎంసీ కమ్యూనిటిహాలులో గురువారం ప్రాంతీయ హోమియోపతి పరిశోధన సంస్థ, కేంద్రీయ హోమియోపతి పరిశోధన మండలి ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో పలువురు పాల్గొని వైద్య పరీక్షలు చేయించుకున్నారు. అనంతరం వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ప్రతి గురువారం బౌద్ధనగర్ జీహెచ్‌ఎంసీ కమ్యూనిటీ హాలులో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు శిబిరాన్ని నిర్వహిస్తున్నామని వైద్యులు తెలిపారు. వైద్యులు డాక్టర్ ప్రసన్నలక్ష్మి, కిషోర్, కె.సాయి తదితరులు పాల్గొన్నారు.

రేపు ఉచిత రక్తదాన శిబిరం

చిలకలగూడ, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): తలసేమియా బాధిత చిన్నారుల కోసం శనివారం చిలకలగూడ విద్యావిహార్, మెట్రో పిల్లర్ నంబర్ 1142 పాఠశాలల వద్ద ఉచిత రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నామని మారేడుపల్లి మండల ఉపవిద్యాశాఖాధికారి, మండల ఉపాధ్యాయ బృందం తెలిపింది. ఈ శిబిరంలో హైదరాబాద్ జిల్లా కలెక్టర్ హరిచందర దాసరి, ప్రముఖ విద్యావేత్త, మానవ హక్కులనేత ప్రొఫెసర్ హరగోపాల్, హైదరాబాద్ జిల్లా విద్యాశాఖాధికారిణి రోహిణి, రెవెన్యూ అధికారి వెంకటచారి, రెడ్‌క్రాస్ సంస్థ అధ్యక్షులు ఎం.భీమ్‌రెడ్డిలు ముఖ్యఅతిథులుగా పాల్గొంటారని తెలిపారు. రక్తం దానం చేసి తలసేమియా చిన్నారులను ఆదుకోవాలని తెలిపారు.



రైల్వే జీఎంకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న పెన్షనర్స్ అసోసియేషన్ సభ్యులు

రైల్వే జీఎంకు వినతిపత్రం

చిలకలగూడ, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని, రైల్వే ఆస్పత్రిలో మెరుగైన సౌకర్యాలు కల్పించాలని పెన్షనర్స్ అసోసియేషన్ సభ్యులు రైల్వే జీఎం సంజయ్‌కుమార్ శ్రీవాస్తవను కోరారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎస్.ఎన్.సీ రామకృష్ణాచార్యులు, ఎజీకే మూర్తి, కె.నారాయణ, విద్యాసాగర్, సాయికుమార్‌లు రైల్వే జీఎంను కలిసి వినతిపత్రం అందజేశారు. డిసెంబరులో నిర్వహించనున్న అసోసియేషన్ త్రై వార్షిక సమావేశం, పెన్షనర్స్ డే వేడుకల్లో పాల్గొనాలని ఆయనను కోరారు.



చైల్డ్ వెల్ఫేర్ కమిషనర్ శృతి యోజాకు మెమోరాండం అందజేస్తున్న ఐహెచ్‌ఆర్‌సీఐ బృందం

బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు కృషి

అడ్డగుట్ట, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : బాల కార్మికుల నిర్మూలనకు తమ సంస్థ ఐక్యంగాపనిచేస్తుందని జాతీయ మానవ హక్కుల కమిటీ ఇండియా జాతీయ అధ్యక్షుడు కటకం శ్రీనివాస్ తెలిపారు. గురువారం ఉమెన్ చైల్డ్ వెల్ఫేర్ కమిషనర్ శృతి యోజాను కలిసిమెమోరాండం సమర్పించిమని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిల్డ్రన్స్‌డే సందర్భంగా రాష్ట్రంలో బాల కార్మికుల నిర్మూలనపై ప్రత్యేక దృష్టి సారించామని కమిషనర్ దృష్టికి తీసుకొచ్చారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో తమ సంస్థ సభ్యులు ఉంటారని ఎక్కడెక్కడ బాలకార్మికులు పనిచేస్తారో మీ దృష్టికి తీసుకొస్తామని సూచించారు. కమిషనర్‌ను కలిసిన వారిలో సంస్థ జాతీయ అదనపు కోశాధికారి సరాబ్ తులసి, ముఖ్య న్యాయ సలహాదారుడు క్రాంతి కుమార్, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు వాడకట్టు శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శి అయిత భాస్కర్, విరబోయిన రమేష్, వంశీలు ఉన్నారు.

ముచ్చింతల్‌కు బస్సులు



సరితాదేవి, డిపో మేనేజర్

తిరుమలగిరి నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): రిసాలాబజార్ నుంచి ముచ్చింతల్‌కు ప్రతి శుక్ర, శని, ఆదివారాల్లో ప్రయాణీకుల సౌకర్యార్థం బస్సులను ఏర్పాటు చేయడం జరిగిందని హకీంపేట డిపో మేనేజర్ సరిత గురువారం పత్రిక ప్రకటనలో తెలిపారు. రిసాలాబజార్ నుంచి ఉదయం 7.20 గంటలకు, అల్వాల్ నుంచి మధ్యాహ్నం 3.00 గంటలకు బస్సులు బయలుదేరతాయని తెలిపారు. అలాగే ముచ్చింతల్ నుంచిమధ్యాహ్నం 12:30 గంటలకు, రాత్రి 8:00 గంటలకు బస్సులు బయలుదేరతాయని అన్నారు. ప్రయాణీకులు ఇలాంటిసౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు.



కార్తీక పూజలు చేస్తున్న న్యాయవాదులు

కార్తీకమాస పూజలు

అడ్డగుట్ట, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : సికింద్రాబాద్ సివిల్ కోర్టు ఆవరణలో ఉన్న 105 ఏళ్ల నాటి వృక్షానికి న్యాయవాదులు మొక్కులు తీర్చుకున్న అనంతరం కోర్టు ఆవరణలోకార్తీక మాసం సందర్భంగాగురువారం ప్రత్యేక పూజలు చేశారు. వృక్షానికి పూలమాలలు వేసి దీపారాధన చేసి వేద మంత్రోచ్చారణల మధ్య పూజలు చేశారు. ఈ రాగి చెట్టు కోర్టు ప్రాంగణానికి శోభను చేకూర్చుతోందని దీని సాక్షిగా న్యాయస్థానం ఎన్నో తీర్పులు చేసిందని కోర్టు బార్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యుడు సీనియర్ న్యాయవాది గుంజి సంతోష్ కుమార్ తెలిపారు.



అయ్యప్ప పడిపూజ

మాణికేశ్వర్‌నగర్‌లోని సెవెన్ టెంపుల్ ఆలయంలో అయ్యప్ప సేవాసమితి ఆధ్వర్యంలో గురువారం అయ్యప్ప పడిపూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గురుస్వామి జి.వెంకటేశ్, సెవెన్ టెంపుల్ చైర్మన్ గండికోట విజయ్‌కుమార్, గురుస్వాములు వి. సహదేవ్, వరికుప్పల లక్ష్మణ్, గండికోట ఆనంద్ కుమార్, చంద్రమౌళి, జి. కుమార్, జి. రవితేజ. వి. శ్యామ్, ఆనందర్ కుమార్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

- తార్నాక, ఆంధ్రజ్యోతి

ఎన్‌డీఎల్‌సీ క్యాంపును సద్వినియోగం చేసుకోవాలి



సీడీఏ కార్యాలయంలో జరుగుతున్న డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్ క్యాంపు

బోయినపల్లి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : పెన్షనర్ల కోసం కేంద్ర ప్రభుత్వం డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్ (డీఎల్‌సీ) క్యాంపును నవంబరు 30 వరకు సికింద్రాబాద్‌లోని పీ అండ్ టీ కాలనీ కంట్రోలర్ ఆఫ్ డిఫెన్స్ అకౌంట్ కార్యాలయంలో నిర్వహిస్తుంది. ఈ సేవలను అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలని కంట్రోలర్ ఆఫ్ డిఫెన్స్ అకౌంట్ కార్యాలయం సీనియర్ ఆడిటర్ శ్రీనివాస్ పేర్కొన్నారు. క్యాంపులో పెన్షనర్ల డేటా వెరిఫికేషన్ ఫ్యామిలీ పెన్షన్, డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్ సేవలు అందుబాటులో ఉన్నాయి. ఈ సౌకర్యాలు పొందాలనుకునే అర్హులు తమ ఆధార్ కార్డు, బ్యాంక్ పాస్ బుక్, సర్వీస్ బుక్, పాన్ కార్డులను తీసుకుని సీడీఏ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేసుకుని సర్టిఫికెట్ పొందాలి. ఈ కేంద్రంలో కేవలం డిఫెన్స్ పెన్షనర్ల కోసం మాత్రమే స్పర్శ సర్వీస్ సెంటర్ సీడీఏ సికింద్రాబాద్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రతి పెన్షనర్ ఇంటికి వెళ్లి డీఎల్‌సీ జనరేట్ చేస్తారు. సాధారణంగా పెన్షన్ కోసం ఏటా పెన్షనర్లే వెళ్లి లైఫ్ సర్టిఫికెట్ ఇవ్వాల్సి ఉంటుందని, నవంబరు 30 వరకు పెన్షనర్ల కోసం దేశ వ్యాప్తంగా డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్ కార్యక్రమాన్ని కేంద్రం నిర్వహిస్తుంది. దేశంలోని మారుమూల ప్రాంతాలలోని ప్రతి పెన్షనర్‌కు చేరువయ్యే లక్ష్యంతో పెన్షన్ పంపిణీ బ్యాంకులు, ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంక్, పెన్షనర్ల సంక్షేమ సంఘాలు, కంట్రోలర్ జనరల్ ఆఫ్ డిఫెన్స్ అకౌంట్స్, టెలి కమ్యూనికేషన్స్ విభాగం, రైల్వేలు, భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ, ఎలక్ట్రానిక్స్, సమాచారం సాంకేతిక మంత్రిత్వ శాఖల సహకారంతో దీనిని నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

దొంగలకు స్థానికుల దేహశుద్ధి



దొంగలను స్తంభానికి కట్టివేసిన స్థానికులు

బోయిన్‌పల్లి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): బోయిన్‌పల్లిలోని కంసాలి బజారులో రామాలయం దేవాలయం వద్ద ఓ ఇంటిలో దొంగతనానికి పాల్పడిన ఇద్దరు వ్యక్తులను స్థానికులు పట్టుకుని దేహశుద్ధి చేశారు. గత శనివారం ఓ ఇంట్లో వారిద్దరు దేవుడి సామాగ్రిని దొంగలించారు. అయితే మరోసారి కూడా దొంగతనానికి ప్రయత్నించారు. ఈ క్రమంలో రెండు రోజులక్రితం రాత్రి కూడా దొంగతనానికి పాల్పడిన వారిని గమనించిన స్థానికులు ఎలాగైనా పట్టుకోవాలని ఉద్దేశంతో కాపుగాసి పట్టుకున్నారు. దీంతో వారు దొంగిలించిన 12 కిలోల మూడు ఇత్తడి తాంబాలాలు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం వారిని స్తంభానికి కట్టివేసి బోయిన్‌పల్లి పోలీసులకు సమాచారం ఇచ్చారు. వీరు దొంగలించిన సామాగ్రిని ఫతేనగర్‌లో షాపులో రికవరీ చేసినట్లు స్థానికులు తెలిపారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న గోపాలపురం సీఐ మధు కుమార్

లాడ్జిల్లో పోలీసుల తనిఖీలు

అడ్డగుట్ట, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : ఢిల్లీలో బాంబు పేలుళ్ల నేపథ్యంలో ముందస్తు జాగ్రత్తగా గోపాలపురం పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ మధు కుమార్‌తో పాటు ఎస్సైలు, కానిస్టేబుళ్ల సికింద్రాబాద్‌లో ఉన్న లాడ్జిల్లో తనిఖీలు నిర్వహించారు. లాడ్జిల్లోని రికార్డులను పరిశీలించారు. లాడ్జిలకు వచ్చేవారి వివరాలు, ఐడీ కార్డులు తప్పని సరిగా తీసుకోవాల్సిన బాధ్యత యజమానులకు ఉందన్నారు. ఎవరైనా అనుమానిత వ్యక్తులు కనిపిస్తే తమకు ఫిర్యాదు చేయాలని లాడ్జిల యజమానులకు సీఐ సూచించారు.



సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ వద్ద రద్దీ

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

అడ్డగుట్ట, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్‌లో హై అలర్ట్ ప్రకటించడంతో వాణిజ్య కేంద్రంగా పేరున్న సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ చుట్టుముట్టు ఆల్ఫా హోటల్, మోండా మార్కెట్ ఏరియాలో విపరీతమైన ఉంటుందన్న విషయం తెలిసిందే. దీంతో ప్రజలు పనుల నిమిత్తం బయటకు వచ్చేప్పుడు ఒకే ప్రదేశంలో గుంపులుగా ఉండకుండా, అప్రమత్తంగా ఉండాలని పోలీసు అధికారులు పేర్కొంటున్నారు. ఇలాంటి సమయంలో ప్రయాణికులు, వాహనదారులు తగు జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



బ్యాగును అప్పగిస్తున్న దృశ్యం

క్యాబ్‌లో మర్చిపోయిన బ్యాగ్ తిరిగి అప్పగింత

తిరుమలగిరి నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): క్యాబ్‌లో మరిచిపోయిన బ్యాగును తిరిగి ఆర్మీ ఇంజనీర్‌కు అప్పగించిన ఘటన తిరుమలగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం బెంగళూరులో ఆర్మీ ఇంజనీర్‌గా విధులు నిర్వహిస్తున్న నరేష్ గురువారం సికింద్రాబాద్‌లో బంధువుల ఇంట్లో శుభకార్యానికి హాజరు కావడానికి కుటుంబంతో కలిసి క్యాబ్ సిద్దిపేట నుంచి క్యాబ్‌లో లాల్‌బజార్‌కు చేరుకున్నాడు. అయితే క్యాబ్‌లో తన బ్యాగ్‌ను మరచిపోయినట్లు ఆలస్యంగా తెలుసుకుని వెంటనే తిరుమలగిరి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు, క్రైం విభాగం సీసీ ఫుటేజ్‌లను పరిశీలించి క్యాబ్‌ను ట్రేస్ చేసి పోలీస్‌స్టేషన్‌ను రప్పించారు. అనంతరం బ్యాగ్‌ను ఆర్మీ ఇంజనీర్‌కు అప్పగించారు. ఈ సందర్భంగా ఆర్మీ కుటుంబ సభ్యులు మాట్లాడుతూ బ్యాగ్‌లో ఐడీ కార్డు, విలువైన వస్తువులు, కూతురుకి సంబంధించిన మెడిసిన్ ఉన్నట్లు తెలిపారు. ఈ కేసును డీఐ విజయ్ రాజ్, కానిస్టేబుల్ భాను చందర్ చాలా చాకచక్యంగా ఛేదించారు.

నిరుద్యోగులకు శిక్షణ, ఉపాధి అవకాశాలు

అడ్డగుట్ట, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : నిరుద్యోగ యువతీ యువకులకు మెడికల్ కోడింగ్ బిల్లింగ్ శిక్షణ, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్లు ఆప్సాటిక్, టెక్ మహీంద్రా ఫౌండేషన్ స్మార్ట్ ట్రైనింగ్ సెంటర్ హబ్సిగూడ సెంటర్ సమన్వయకర్త పురుషోత్తం గోపీ తెలిపారు. యువతి యువకులు 20-27 ఏళ్ల మధ్య వయస్సు కలిగి, బీఎస్సీ, ఎమ్మెస్సీ, బీఫార్మా, ఎంఫార్మా, బీకాం, ఎంకాం విభాగాల్లో ఉత్తీర్ణులైన వారికి మెడికల్ కోడింగ్, బిల్లింగ్ టెర్మినాలజీ, ఎమ్మెస్ ఆఫీస్, స్పోకెన్ ఇంగ్లీష్, ఇంటర్నెట్, ఇంగ్లీష్ టైపింగ్, కమ్యూనికేషన్ స్కిల్స్, ఇంటర్వ్యూల్లో శిక్షణతో పాటు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. వివరాలకు 9154990132, 9154990131 నంబర్లను సంప్రతించాలన్నారు.

ఏఐఎంఐఎం సికింద్రాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి నియామకం



నియామకపత్రాన్ని అందజేస్తున్న ఏఐఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ

బౌద్ధనగర్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): ఆల్ ఇండియా మజ్లిస్ ఈ ఇత్తెహదుల్ ముస్లిమీన్(ఏఐఎంఐఎం) సికింద్రాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జిగా చిలకలగూడకు చెందిన పఠాన్ రషీద్‌ఖాన్ నియామితులయ్యారు. ఈ మేరకు ఏఐఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఓవైసీ గురువారం రషీద్‌ఖాన్‌కు నియామకపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పఠాన్ రషీద్ ఖాన్ మాట్లాడుతూ నియోజకవర్గంలో ఎంఐఎంను మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా ఏఐఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీకి కృతజ్ఞతలు తెలిపారు. సికింద్రాబాద్ ఏఐఎంఐఎం కమిటీలో స్థానిక నాయకులు జుబైర్‌ఖాన్, ముజమ్మిల్ అహ్మద్, ఫయాజ్, రహీమ్‌ఖాన్, జహంగీర్ ఖురేషీ, జహైద్‌హసన్, అజామ్, నదీమ్, అయూబ్‌లకు వివిధ కేటగిరీల్లో అవకాశం కల్పించారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి



మృతదేహం

అడ్డగుట్ట, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : సికింద్రాబాద్‌లో ఓ వ్యక్తి అనుమానాస్పదస్థితిలో మృతి చెందిన ఘటన గోపాలపురం పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై సుబ్బారావు తెలిపిన వివరాల ప్రకారం సికింద్రాబాద్‌లోని శ్రీకర హాస్పిటల్ వెనుక వైపున రైల్వే గెస్ట్‌హౌజ్ వద్ద గుర్తుతెలియని 55 ఏళ్ల వ్యక్తి పడి ఉండగా పెట్రోలింగ్ కానిస్టేబుళ్ల చూసి ఎస్సైకి సమాచారం ఇచ్చారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. మృతుడు ఎలా చనిపోయాడో వివిధ కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

బోయిన్‌పల్లిలో ఇద్దరు గంజాయి విక్రేతల అరెస్ట్

బోయిన్‌పల్లి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో అక్రమంగా గంజాయి రవాణా చేస్తున్న ఇద్దరు వ్యక్తులను బోయినపల్లి పోలీసులు, స్పెషల్ టాస్క్ ఫోర్స్ అధికారులు పట్టుకుని అరెస్టు చేశారు. ఇన్‌స్పెక్టర్ తిరుపతి రాజు, ఎస్ఐ నందిత కిరణ్ తెలిపిన వివరాల ప్రకారం.. హస్మత్‌పేటకు చెందిన ప్రేమ్‌కుమార్‌రాయ్(47), ఓల్డ్ బోయిన్‌పల్లికి చెందిన మహ్మద్ నసీమ్ అలియాస్ నసీమ్(37) కొంతకాలంగా గంజాయి విక్రయిస్తూ జల్సాలకు అలవాటుపడ్డారు. ఈ క్రమంలో బోయిన్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో గంజాయి విక్రయాలు చేస్తున్నారన్న విశ్వసనీయమైన సమాచారంతో స్పెషల్ నార్కోటిక్, బోయిన్‌పల్లి పోలీసులు వారి పైన నిఘా పెట్టారు. గురువారం ప్రేమ్‌కుమార్‌రాయ్, నసీమ్ బోయిన్‌పల్లిలోని కల్యాణ్ థియేటర్ సమీపంలో గంజాయి విక్రయించనున్నారని సమాచారంతో అక్కడకు చేరుకున్న పోలీసులు వారిద్దరూ వచ్చిన వాహనాన్ని ఆడుకుని తనిఖీలు చేశారు. దీంతో వారి వద్ద గంజాయి ఉన్న కొన్ని డబ్బాలు దొరికాయి. దీంతో వారిని విచారించగా సుమారు కిలోన్నర గంజాయి ఉన్నట్లు నిందితులు పోలీసులకు తెలిపారు. ఈ క్రమంలో వారు దాచిపెట్టిన ప్రాంతానికి వెళ్లి అక్కడ గంజాయిని స్వాధీనం చేసుకుని, కేసునమోదు చేసుకున్నారు. కాగా, వారి నుంచి ద్విచక్రవాహనం, సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. వారిని శుక్రవారం కోర్టులో హాజరుపరుచున్నట్లు పోలీసులు తెలిపారు.

చెరువులో మట్టి నింపిన వారిపై చర్యలు తీసుకోవాలి

తిరుమలగిరి నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): తిరుమలగిరి లేక్ చెరువులో బుధవారం రాత్రి టిప్పర్ల సాయంతో గుర్తుతెలియని వ్యక్తులు భారీగా మట్టి పోశారు. చెరువును కబ్జా చేయడానికి యత్నిస్తున్నారని కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేశారు. చెరువు విస్తీర్ణం తగ్గించేందుకు అక్రమంగా మట్టిని నింపుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ అక్రమ కార్యకలాపాలపై వెంటనే చర్యలు తీసుకోవాలని అధికారులను డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మధుసుదన్, సతీష్, రాకేష్ పాల్గొన్నారు.

వేర్వేరు ప్రాంతాల్లో ముగ్గురు అదృశ్యం



లావణ్య

అడ్డగుట్ట, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : ఇంటి నుంచి బయటికి వెళ్లిన ఓ మహిళ అదృశ్యమైన ఘటన తుకారాంగేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం అడ్డగుట్ట ప్రాంతానికి చెందిన కాసు మల్లేష్ కుమార్తె కురువ లావణ్య(23) బాలాజీనగర్‌లో ఉంటుంది. భర్తతో గొడవ పడి రెండు రోజుల క్రితం తల్లిదండ్రుల దగ్గరకు వచ్చింది. బుధవారం రాత్రి భోజనం చేసి పడుకున్న లావణ్య గురువారం తెల్లవారుఝామున ఇంటిలో కనిపించలేదు. దీంతో తల్లిదండ్రులు బంధువులు, స్నేహితుల ఇళ్లలో వాకబు చేసినా ఫలితం లేకపోవడంతో తండ్రి తుకారాంగేట్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తులో ఉంది.

ఎంఎస్ మక్తాలో బాలుడు..



తన్వీర్ అలామ్

అడ్డగుట్ట, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : ఇంటి నుంచి బయటికి వెళ్లిన ఓ బాలుడు అదృశ్యమైన ఘటన లేక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఎంఎస్ మక్తా ప్రాంతానికి చెందిన తన్వీర్ అలామ్(13) 12న ఇంటి నుంచి బయటికి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు బంధువులు, స్నేహితుల ఇళ్లలో వాకబు చేసినా ఫలితం లేకపోయింది. వెంటనే తల్లి ఖతోన్ గురువారం లేక్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకుంటున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

మధురానగర్ కాలనీలో వ్యక్తి..



రాఘవేందర్

బౌద్ధనగర్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఇంటి నుంచి వెళ్లిన ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటన వారాసిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై సునీత తెలిపిన వివరాల ప్రకారం పార్శీగుట్ట మధురానగర్‌కాలనీలో కుమారుడు వి.రాఘవేందర్(38) తండ్రి వి.జగన్నాథం (84)లు నివసిస్తున్నారు. 4వ తేదీ రాత్రి 7:30కు రాఘవేందర్ ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. కంగారుపడిన తండ్రి ఈ విషయాన్ని బోడుప్పల్‌లో నివశించే కుమార్తె పద్మావతికి ఫోన్ చేసి తెలిపాడు. రాఘవేందర్ కోసం పలుచోట్ల గాలించినా ఫలితం లేకపోవటంతో తన తమ్ముడు కనిపించటం లేదని అక్క పద్మావతి బుధవారం రాత్రి వారాసిగూడ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసును నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బీసీ రిజర్వేషన్లు చట్టపరంగానే ఇవ్వాలి: స్వామిగౌడ్



మాట్లాడుతున్న బీసీ విద్యార్థి జేఏసీ చైర్మన్ స్వామిగౌడ్

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను పార్టీల పరంగా కాకుండా చట్టపరంగానే ఇవ్వాలని, ఆ రిజర్వేషన్ల ఆధారంగా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని బీసీ విద్యార్థి జేఏసీ చైర్మన్ బొల్లెపల్లి స్వామిగౌడ్ డిమాండ్ చేశారు. ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజీ ప్రాంగణంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం తొందరపడి స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించకూడదని సూచించారు. కాంగ్రెస్ పార్టీ వచ్చే ఎన్నికల్లో అధికారంలోకి రావాలంటే సీఎం రేవంత్‌రెడ్డి అన్ని పార్టీలతో కలిసి అఖిల పక్ష బృందంతో ప్రధాని మోదీని కలవాలన్నారు. ఒకవేళ అపాయింట్‌మెంట్ ఇవ్వకపోతే, పార్లమెంట్‌లో ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీ ప్రయివేట్ బీసీ బిల్లు ప్రవేశపెట్టాలన్నారు. ఈ శీతకాల సమావేశాల్లోనే బీసీ రిజర్వేషన్లపై ఎవరు అనుకూలం, ఎవరు వ్యతిరేకమనేది పార్లమెంట్‌లో బయటపడుతుందన్నారు. కౌశిక్, నిఖిల్, మహేష్, శ్రీకాంత్, రవీందర్, శ్రీను, అరవింద్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.